క్లుప్తంగా

22 నుంచి నవరాత్రి ఉత్సవాలు



పందిరి కర్ర పూజ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని యల్లనూరు రోడ్డులో వెలసిన విజయ చౌడేశ్వరిదేవి దసరా నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ పోతుల గంగాధర్ తెలిపారు. దేవాలయం ఆవరణలో మంగళవారం ఉత్సవాల కోసం పందిరి కర్రను ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శివారెడ్డి, నారాయణ స్వామి సభ్యులు హనుమంతరెడ్డి, కృష్ణమోహన్,మణిదీపు, రిషీంద్ర, జగదీష్, వేణుగోపాల్, గంగరాజు, సాయి, రాజు, గణేష్ పాల్గొన్నారు.

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో చేరడానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బద్రీనాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మూడు విడతల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు నాలుగో విడత కింద అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

మాదిగల కృతజ్ఞత సభకు తరలిరండి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నెల 22న నిర్వహించే మాదిగల కృతజ్ఞత సభకు కులస్తులు, ఉద్యోగులు, కార్మికులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ భీమలింగ కోరారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద కృతజ్ఞత సభ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్, నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎర్రిస్వామి, నాయకులు హనుమేష్, రామాంజి, మస్తాన్ పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీలోని కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ రామాంజనేయులు మంగళవారం తెలిపారు. ఉదయం 10గంటలకు జరుగనున్న హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమానికి ఆసక్తి గల వారు పంచ, టవాలుతో హాజరుకావాలన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



నగరూరు ఉన్నత పాఠశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

యాడికి: మండలంలోని నగరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు మంగళవారం నాలుగు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారని హెచ్‌ఎం కుళ్లాయప్ప మంగళవారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ 1987–1992లో నగరూరు ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు రూ.8 వేల విలువ చేసే సీలింగ్ ఫ్యాన్లు అందజేశారన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామ్మోహన్, రాం భూపాల్‌రెడ్డి, , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



నార్పల డిప్యూటీ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శింగనమల(నార్పల): మండల కేంద్రమైన నార్పలలో సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. మంగళవారం నార్పల ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ శైలజారాణికి వినతిపత్రం అందజేశారు. నార్పలలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని, శివకళాజ్యోతి వద్ద ఉన్న బస్టాండ్ సర్కిల్‌లో సీసీ రోడ్డు వేయాలని కోరారు. వర్షం వచ్చినప్పుడు ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా షెల్టరు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర, సుధాకర్, పెద్దయ్య, నారాయణప్ప, సూరి, తిమ్మరాజు, షేక్షావలి, శీన, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య



తాడిపత్రిలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

- ఇష్టానుసారంగా పార్కింగ్
- పట్టించుకోని పోలీసులు

తాడిపత్రి రూరల్: పట్టణంలో రోజు రోజుకూ ట్రాఫిక్ పెరుగుతోంది. గతంలో ఉదయం, సాయంత్రం సర్కిల్ పాయింట్లలో పోలీసులు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం వల్ల కొంతవరకూ రద్దీ తగ్గేది. ప్రస్తుతం ట్రాఫిక్ గురించి పోలీసులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో పుట్లూరు రోడ్డు సర్కిల్, యల్లనూరు రోడ్డు సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, అశోక్‌పిల్లర్ నాలుగు రోడ్ల కూడళ్లు కావడంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. తాడిపత్రి పట్టణం మూడు జిల్లా కేంద్రంగా ఉండడంతో రోజూ వేలాది ద్విచక్ర వాహనాలు, వందలాది ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణంలో పలు చోట్ల పార్కింగ్ పాయింట్లు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు రోడ్లకు ఇరువైపులా అడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ సర్కిల్ పాయింట్ల వద్ద ఎక్కువగా పార్కింగ్ సమస్య ఉంటోంది

అటకెక్కిన భారీ వాహనాల నిషేధం

ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ భారీ వాహనాలతో పాటు ప్రమాదకరంగా మారిన ట్రాక్టర్లు, ఇతర వాహనాలు పట్టణంలోని రాకపోకలు సాగించడం నిషేధించారు. పట్టణానికి బయట ఉన్న రింగ్ రోడ్డు ద్వారా వాహనాల రాకపోకలు సాగించాలని అధికారులు ఆదేశించారు. ఈ నిషేధాన్ని పోలీసులు కొద్దిరోజుల పాటు కూడా అమలు చేయలేదు. తాడిపత్రి పట్టణ పరిసర ప్రాంతాల్లోని భారీ పరిశ్రమలతోపాటు గ్రానైట్, కడప స్లాబ్ యూనిట్లకు సంబంధించిన ముడిసరుకుతో అధిక టన్నేజీతో కూడిన వాహనాలు ఉదయం వేళల్లో రాకపోకలు సాగిస్తుండటం కూడా ప్రమాదాలతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మెయిన్ బజారులో నిలిచిపోతున్న వాహనాలు

పట్టణంలో ప్రధాన వాణిజ్య పాయింట్‌గా మెయిన్ బజారులో నిత్యం వాహనాల రద్దీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నాయి. మండీ అంగళ్లు, బంగారు వ్యాపార దుకాణాలకు ప్రధాన కేంద్రంగా ఉంటోంది. గతంలో రహదారి పెద్దగా ఉండేది. వ్యాపారులు రోడ్డు అక్రమించి దుకాణాల విస్తీర్ణాన్ని పెంచుకున్నారు. కొందరు ముందుభాగం వ్యాపారాలకు అద్దెలకు ఇచ్చి వెనుక భాగంలో నివాసం ఉంటున్నారు. ఒకరిని చూసుకుని మరొకరు రోడ్డును అక్రమించారు. గతంలో మునిసిపాలిటీ, ఆర్ అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరణకు ప్రయత్నించారు. కానీ చివర్లో విస్తరణ విరమించడంతో ఏడాదికేడాది రోడ్డు కుచించుకుపోతోంది. ఇరుకుగా ఉన్న రోడ్డుకు ఇరువైపులా ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఉన్నతాధికారుల స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



మెయిన్ బజారులో భారీ వాహనం నుంచి సరుకులను అన్‌లోడ్ చేస్తుండటంతో నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ నియంత్రించాలి



పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ పట్ల పోలీసు అధికారులు శ్రద్ధ తీసుకోవాలి. ట్రాఫిక్ పాయింట్ల వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీసులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను రద్దీ తగ్గేలా చూడాలి. రోడ్లకు ఇరువైపుల ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలి.

– చిరంజీవి, సీపీఐ పట్టణ కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం



పట్టణంలో ట్రాఫిక్ కంట్రోల్ కోసం పోలీసులను నియమిస్తాం. తరచుగా బందోబస్తులకు పోలీసులు వెళ్లడంతో ట్రాఫిక్ కోసం పోలీసులను వినియోగించలేకపోతున్నాం. సిబ్బందిని బట్టి అవసరమైన ప్రాంతాల్లో పోలీసులను నియమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాం

– శివగంగాధర్‌రెడ్డి, అప్‌గ్రేడ్ సీఐ

వైఎస్సార్ పేరు తొలగించడం దుర్మార్గం



మాట్లాడుతున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: సహకార సంఘం సొసైటీ కార్యాలయంపై ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు తొలగించడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలనకు నిదర్శమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. వైఎస్సార్ సేవలకు గుర్తుగా 2009 నవంబర్‌లో బీకేఎస్ సహకార సంఘం సొసైటీలో సర్వసభ్య సమావేశం నిర్వహించి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, మండలంలోని రైతుల ఆమోదంతో సొసైటీ కార్యాలయానికి డాక్టర్ వైఎస్సార్ రాజశేఖరరెడ్డి సహకార సంఘం సొసైటీ అని పేరు పెట్టి తీర్మానించామన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మహానేత వైఎస్సార్ పేరు చెడిపేయొచ్చు గానీ రైతుల గుండెల్లో ఉన్న అభిమానాన్ని చెడిపేయలేరన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రైతులు యూరియా కోసం రోడ్లెక్కారన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ మండల అధ్యక్షుడు పూల రంగా, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరికూటి కాటమయ్య, చేతనేత విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల భాస్కర్, మండల కార్యదర్శి జగదీశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రఘు, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు

పుట్లూరు: ఉపాధి పథకం కింద మూగ జీవాల కోసం నిర్మించిన నీటి తొట్టెల్లో వర్షపు నీరు నిలిచి, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని తక్కళ్లపల్లి సర్పంచ్ మహేశ్వరరెడ్డి వాపోయారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ తులసీప్రసాద్ ఉపాధి పథకం కింద నిర్మించిన నీటి తొట్టెల గురించి సభ్యులకు వివరించారు. శనగలగూడూరు ఎంపీటీసీ భూమిరెడ్డి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులలో రెగ్యులర్ వైద్యులు ఉండేలా చూడాలని అధికారులను కోరారు. ఈ విషయమై స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంఈఓ శ్రీదేవి, ప్రేమ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళలకు వైద్య శిబిరాలు

గుంతకల్లు రూరల్/గుత్తి/శింగనమల: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు మండలంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. నాగసముద్రం, అయ్యవారుపల్లి సచివాలయాల పరిధిలో ఈ నెల 17న పీహెచ్‌సీ నాగసముద్రంలో, నెలగొండ, వెంకటాంపల్లి సచివాలయాల పరిధిలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. అలాగే గుత్తి మండలంలో ఈ నెల 17 నుంచి నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గుత్తి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా శింగనమల మండలంలోని తరిమెల పీహెచ్‌సీలో ఈ నెల 17న స్వస్థ నారీ శక్తివంతమైన కుటుంబ కార్యక్రమం ప్రారంభమవుతుందని మండల వైద్యాధికారి శంకర్ నాయక్ తెలిపారు.

అవినీతి ఉద్యోగులపై చర్యలు తీసుకోండి



సీటీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గుంతకల్లు: స్థానిక కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో పనిచేస్తున్న అవినీతి ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ న్యూ ఎంఎల్ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బీ.సురేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం సీటీఓ సురేంద్రరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జీరో వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారులతో నెలవారీ మామూళ్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. సీటీఓ కార్యాలయంలో పనిచేసే ఏసీటీఏ, అటెండర్ ఇందులో కీలక పాత్ర పోషిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్తార్, రామాంజనేయులు, ఐఎఫ్‌టీయూ నాయకులు బాషా, విశ్వనాథ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎస్‌ఆర్‌ఐటీ యాజమాన్యం, ఓల్క్‌స్పాంటమ్ ఐపీ సొల్యూషన్స్ లిమిటెడ్

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, ఓల్క్‌స్పాంటమ్ ఐపీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేథో సంపత్తి హక్కుల (ఐపీఆర్) పరిరక్షణ, ఆవిష్కరణల ప్రోత్సాహకం కోసం అవగాహన (ఎంఓయూ) ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాకర్ బాలక్రిష్ణ తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా పేటెంట్లు, ట్రేడ్ మార్కులు, కాపీరైట్స్, ఇండస్ట్రియల్ డిజైన్‌లు, స్టార్టప్ రిజిస్ట్రేషన్లు, జియోగ్రాఫికల్ ఇండికేషన్ల వంటి మేథో సంపత్తి రక్షణకు తోడ్పాటు లభిస్తుందన్నారు. అలాగే టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ సామర్థ్యాభివృద్ధి మార్గదర్శక మద్దతు ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆవిష్కరణ, వాణిజ్యీకరణ స్థిరమైన అభివృద్ధికి ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. ఈ భాగస్వామ్యం విద్యార్థుల ఆవిష్కరణలకు, మేథో సంపత్తిని రక్షించడానికి మంచి అవకాశం కల్పించడంతో పాటు ఆవిష్కరణలను మార్కెట్‌లోకి తీసుక రావడానికి బలమైన వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఐఈడీపీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూఏసీ డైరెక్టర్ సాయి చైతన్య కిషోర్, సీఎస్‌ఈ విభాగం అధిపతి వీర ప్రకాష్, సీఎస్‌డీ. సీఎస్‌ఎం విభాగం అధిపతి డాక్టర్ చిత్ర లింగప్ప, ఓల్క్‌స్పాంటమ్ ఐపీ సొల్యూషన్ ప్రవేట్ లిమిటెడ్ ఐపీఆర్ అటార్నీ మామిల్లపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోండి



దోనిముక్కలలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: వేరుశనగ, మొక్కజొన్న, వరి పంటలు రసం పీల్చే పురుగు, కత్తెర పురుగు, సుడిదోమ వ్యాపించి దెబ్బతింటున్న నేపథ్యంలో రైతన్నలు పంటలను కాపాడుకోవాలని ఏఓ లీనా వసుంధర సూచించారు. మంగళవారం వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి ఆమె మండలంలోని దోనిముక్కల, నెలగొండ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె రైతులతో కలిసి పంటలను పరిశీలించి, తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. వేరుశెనగకు డైమిథేట్, మొక్కజొన్నకు కు ఇమామెక్టిన్ బెంజోయేట్, వరిపంటకు బూప్రోఫెజన్ లేక ఇతోఫెన్ మందు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ఈ–పంట నమోదు చేయాలి

గార్లదిన్నె: ఈ నెలాఖరులోపు రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని ఏఓ సోమశేఖర్ సూచించారు. మంగళవారం గార్లదిన్నె రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, పచ్చిరొట్ట ఎరువుల వాడకం, జీవన ఎరువులు, అజోల్లా, అజోస్పైరిల్లం ఎరువులు వాడాలన్నారు. అలాగే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల్లో ఇనాక్టివ్ ఉన్న రైతులు ఎన్‌పీసీఐ చేయించుకోవాలన్నారు. అనంతరం పంటకోత ప్రయోగాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీవాణి, హరి, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతోనే రామకృష్ణ నాయక్ మృతి

శింగనమల: శింగనమల మండలం నాగులగుడ్డం తండాకు చెందిన రామకృష్ణ నాయక్ గుండెపోటుతో మృతి చెందారని, పోలీస్‌స్టేషన్‌కు పిలిపించలేదని, పోలీసులు కొట్టటలేదని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐలు విజయకుమార్, సాగర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న రాత్రి 9.30 గంటలకు నాగులగుడ్డం తండాలో పేకాట(మంగ పత్తా) ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐతో పాటు సిబ్బంది వెళ్లి రోహిత్ నాయక్, భాస్కర్ నాయక్, గోపాలు నాయక్, సురేష్ నాయక్, పెద్ద కుళ్ళ నాయక్, రామకృష్ణ నాయక్‌ను అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి నుంచి రూ.7,650 స్వాధీనం చేసుకున్నారన్నారు. గ్రామ పెద్దల జోక్యంతో నిందితులను అక్కడే వదిలి వేసి, ఉదయం పోలీస్ స్టేషన్ రావాలని చెప్పామన్నారు. మరుసటి రోజు ఆయన గుండెపోటుతో మృతి చెందారన్నారు. ఘటనలో పోలీసులకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



పరమేశ్వరరెడ్డి (ఫైల్)

తాడిపత్రి రూరల్: స్థానిక శ్రీనివాసపురానికి చెందిన పరమేశ్వరరెడ్డి (46) ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానిక బానిసైన ఆయన తాగుడుకు కుటుంబసభ్యులు డబ్బు ఇవ్వక పోవడంతో గొడవ పడి మంగళవారం నందలపాడు రైల్వే బ్రిడ్జి వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి సమీపంలో సోమవారం రాత్రి ఓ పేకాట స్థావరంపై ఎస్‌ఐ సురేష్ నేతృత్వంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

నేడు మండల సమావేశం

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని సర్పంచ్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ కార్మికులు

తాడిపత్రిటౌన్: తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలంటూ ట్రాన్స్ కో కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేపట్టారు. తాడిపత్రి పట్టణంలో జేఏసీలో భాగంగా మంగళవారం రెండో రోజు తాడిపత్రి సబ్ డివిజన్ ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ కార్మికులు నల్ల రిబ్బన్‌లతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పవర్ జాక్ కార్మికులు రమణ, మంజు, పావులూరాల శీనయ్య, వెంకటరామిరెడ్డి, రామాంజి, పెంచలయ్య, జిలాన్, నజీర్, బాబా, ప్రభాకర్, లచ్చి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ డిస్ట్రిక్ పోటీల్లో డబుల్ సెంచరీ



మహేంద్రరెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్ కడప జిల్లాలో జరుగుతున్న ఏసీఏ అండర్ – 23 ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ మ్యాచ్ పోటీల్లో తాడిపత్రి క్రీడాకారుడు తవిశాల మహేంద్రరెడ్డి డబుల్ సెంచరీ సాధించినట్లు సీనియర్ కోచ్ సాధిక్‌వలి, కోచ్ భార్గవ్ తెలిపారు. మంగళవారం కడప– అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న పోటీల్లో ఆయన 235 పరుగులు చేశారన్నారు. ఈ సందర్భంగా వారు మహేంద్రరెడ్డిని అభినందించారు.

శైలజానాథ్‌కు పరామర్శ



శైలజానాథ్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్లూరు: శింగనమల నియోజవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. శైలజానాథ్ జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న విషయం విదితమే. మంగళవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి, కార్యనిర్వాహక సభ్యుడు నరసింహారెడ్డి తదితరులు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

అలరించిన సంగీత విభావరి



పాట పాడుతున్న గాయకులు

గుత్తి: పట్టణంలోని కోటలో సయ్యద్ హజరత్ మీర్ ఖాసీం 678వ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం రాత్రి నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు, డాక్యుమెంటరీ హీరో చౌదరి విజయభాస్కర్, బాల సుబ్రమణ్యం కల్చరల్ అసోసియేషన్ సభ్యులు జాఫర్, మల్లికార్జున, విజయభాస్కర్, డాక్టర్ శాంతి ప్రియ, జ్యోతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విరిగిన అంబేడ్కర్ విగ్రహం చెయ్యి

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరులో అంబేడ్కర్ విగ్రహం చెయ్యి విరిగిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రొక్లైన్‌తో విద్యుత్ స్తంభం పైకి ఎత్తుతుండగా చెట్టు కొమ్మలు విరిగి పడడంతో అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు విరిగింది. అలాగే కుడి చెయ్యి పూర్తిగా దెబ్బతింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల అంబేడ్కర్ విగ్రహం చెయ్యి విరిగిందని, కొత్త విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని కాంట్రాక్టర్లతో మాట్లాడారు. నూతన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన ఉరుసు

పామిడి: పట్టణంలోని షాదీఖానాలో మూడురోజులుగా నిర్వహిస్తున్న హజరత్ సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదనీ ఉరుసు మంగళవారం ముగిసింది. చివరిరోజు జియారత్ కార్యక్రమంలో భాగంగా బాబా మదనీకి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు బాబా మదనీ సమాధిని దర్శించుకుని ప్రార్థనలు చేశారు. అనంతరం వెయ్యి మందికి అన్నదానం చేశారు.

రైతులకు యూరియా పంపిణీ

శింగనమల: మండలంలోని శింగనమల, తరిమెల, కల్లుమడి, కొరివిపల్లి, ఉల్లికల్లు రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్ కేంద్రాల్లో రైతులకు 138.6 మెట్రిక్ టన్నులు యూరియా పంపిణీ చేశామని ఏఓ అన్వేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. మిగిలిన రైతు సేవా కేంద్రాలకు మూడు రోజుల్లోపు 126 టన్నుల యూరియా సరఫరా అవుతుందన్నారు. యూరియాను రైతులందరికీ అందజేస్తామన్నారు.

కోళ్ల అపహరణ

పామిడి: స్థానిక ఎద్దులపల్లిరోడ్డులోని సచివాలయ కాలనీలో మంగళవారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో బోయ మల్లికార్జున, బోయ పెద్దన్న ఇళ్లలో రూ.18వేలు విలువ చేసే కోళ్లను గుర్తు తెలియన వ్యక్తులు చోరీ చేశారు.

కొండల్లో మొక్కలు నాటే కార్యక్రమం

గార్లదిన్నె: మండలంలోని ఎంపీఆర్ డ్యాం సమీపంలోని కొండల్లో మంగళవారం ఉపాధి పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ యోగానంద రెడ్డి తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో ఐదు ఎకరాలు ఫారెస్ట్ స్థలంలో బ్లాక్ ప్లాంటేషన్ కార్యక్రమం ద్వారా కొండల్లో, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సీతాఫలం, కానుగ, నారవేప తదితర మొక్కలు నాటామన్నారు. నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దామోదరమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణానికి చెందిన సాయిచైతన్య స్కూల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి కబడడ్డ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ లక్ష్మీనరసింహా తెలిపారు. ఈ నెల 16న గుంతకల్లు మండలం కొనకొండ్ల లో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థులు గౌతమి, సుహనా, అర్షియా, నవ్య ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపియ్యారన్నారు.

మున్సిపల్ ఆపరేటర్‌పై దాడి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సీబీ రోడ్డు వద్ద మున్సిపల్ ఆపరేటర్ క్రిష్ణయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం దాడికి పాల్పడారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సీపీఐ కాలనీలో విధులు ముగించుకుని వస్తున్న క్రిష్ణయ్యను ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి ద్విచక్రవాహనంపై ఫాలో అయ్యారు. సీబీ రోడ్డులో ఉన్న దివాకర్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే 'గడ్డికయ్యల్లో గోతులు ఎందుకు తీశావురా' అంటూ రాడ్లు, కర్రలతో దాడి చేశారు. గాయపడిన అతడిని స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నం

పామిడి: మండలంలోని దేవరపల్లికి చెందిన రైతు నక్కా ఓబులేసు తన పొలం తగాదా విషయంలో సోమవారం అర్ధరాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.